సాక్షి
నిర్మల్

సోమవారం ♦ 19 ♦ ఆగస్టు ♦ 2024



గుంతలరోడ్లపై ప్రయాణమెలా?

కుంటాల మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. 9లో▸



బాసరకు పోటెత్తిన భక్తజనం

బాసరలోని సరస్వతి అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. క్రోధి నామ సంవత్సరం శ్రావణ మాసం చతుర్దశిని పురస్కరించుకుని ఆలయం కిటకిటలాడింది. 10లో▸

గరిష్టం/కనిష్టం
31.6 /25.5

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోత అధికంగా ఉంటుంది. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

మాఫీ.. కొందరికే..!

- రూ.2 లక్షల పైనున్న ఖాతాలకు మొండిచేయి
- సగానికి పైగా రైతుల ఖాతాల్లో జమకాని నిధులు
- రుణ విముక్తికోసం అన్నదాతల ఎదురుచూపు
- నిరసనలకు దిగుతున్న బాధిత రైతాంగం



కుభీర్‌లో నిరసనకు దిగిన రైతులు (ఫైల్)

భైంసా: ఒక కుటుంబంలో రూ.2 లక్షలకుపైన ఉన్న ఏ ఒక్క ఖాతాకు రుణమాఫీ వర్తించలేదు. రూ.2 లక్షలపైన పంట రుణం ఉన్న రైతుల వివరాలు ఎక్కడా జాబితాల్లో రాలేదు. ఒక కుటుంబంలో ముగ్గురు రైతులుంటే వారి పేరు మీద ఉన్న మూడు రుణ ఖాతాలు కలిపి ఒకే రేషన్‌కార్డుపై ఉన్నాయని కారణం చూపి మాఫీ వర్తింపచేయలేదు. దీంతో రుణమాఫీ కాని రైతులంతా నిరసనలకు దిగుతున్నారు. భైంసా, కుభీర్, ముధోల్ మండల కేంద్రాల్లోని రైతువేదికల వద్ద బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మామడలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఎదుట రైతులు నిరసనకు దిగారు.

జిల్లాలో ఇలా...

జిల్లాలోని రైతులు మూడు విడతల్లోనూ పూర్తిస్థాయిలో రుణవిముక్తులు కాలేదు. స్వాతంత్య్ర దినోత్సవం రోజున రూ.2లక్షల రుణమాఫీ చేసిన ప్రభుత్వం జిల్లాలోని 16,835 మంది రైతుల జాబితాను విడుదల చేసింది. మూడు విడతల్లో 66,002 మంది రైతులకే మాఫీ వర్తించింది. జూలై 18న మొదటి విడతలో 30,109, జూలై 30న రెండో విడతలో 19,058, ఆగస్టు 15న మూడో విడతలో 16,835 రైతుల జాబితాలే వచ్చాయి. ముధోల్, నిర్మల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో సుమారు 1.80 లక్షల మంది రైతులు ఉండగా కేవలం 66,002 మంది రైతులకే రుణమాఫీ వర్తించింది. మొదటి, రెండో విడతల్లో రేషన్‌కార్డులు లేవని, పట్టాపాస్‌బుక్‌లు రాలేదని, పేర్లు తప్పుగా ఉన్నాయని.. రైతులు గాబరాపడవద్దని చెప్పి దాటవేశారు. తీరా మూడో విడత రుణమాఫీ వచ్చేసరికి రూ.2 లక్షల కంటే పైగా ఉన్నాయని పొంతనలేని సమాధానం చెబుతున్నారు. ఒక్కో విడతలో ఒక్కో సమాధానం చెబుతూ కాలం వెల్లదీశారు. గత ప్రభుత్వంలో జిల్లాలోని 4.40 లక్షల ఎకరాల భూమికి రెండు విడతల్లో సుమారు రూ.444 కోట్లు ఏడాదిలో జమ చేసేది. రుణమాఫీ కింది లెక్కకడితే రైతు బంధులో జమచేసిన డబ్బులకు సరిపోదని జిల్లా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ప్రచార సభల్లో కాంగ్రెస్ శ్రేణులు ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల మాఫీ చేస్తామని ప్రకటించారు. గతేడాది డిసెంబర్ 9వ తేదీకల్లా మాఫీ చేస్తామని ప్రకటించి చివరకు ఆగస్టు 15 నాటికి మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మూడు విడతలు ముగిసినా సగానికి పైగా రైతుల ఖాతాల్లో ఇంకా నిధులు జమకాలేదు.

నెల రోజులుగా మాఫీ ప్రక్రియ...

రాష్ట్ర ప్రభుత్వం జూలై 18న రుణమాఫీ ప్రక్రియ ప్రారంభించింది. మొదటి విడతలో రూ. లక్ష వరకు, రెండవ విడతలో రూ. 1.50 లక్షల వరకు, మూడవ విడతలో రూ. 2 లక్షల మేర రుణాలను మాఫీ చేసింది. తీరా రేషన్‌కార్డు ఆధారంగా మాఫీ చేస్తామని ప్రకటించారు. జిల్లాలో చాలా మందికి రేషన్‌కార్డులు లేక మాఫీ ఇప్పటికీ వర్తించలేదు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 32.5 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామని చివరకు 22 లక్షల మందితోనే సరిపెట్టారని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. రూ.31వేల కోట్లు మాఫీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం రూ.17,869 కోట్లే మాఫీచేసి సగానికిపైగా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయలేదని రైతులు ఆరోపిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. జిల్లాలో ఏ అధికారిని అడిగినా స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదు.

నమోదుతోనే సరి..

జిల్లా వ్యాప్తంగా రైతులు ఇచ్చిన ఫిర్యాదులు అధికారులు నమోదు చేసుకుంటున్నారు. కానీ ఇప్పటి వరకైతే ఇచ్చిన ఫిర్యాదుల్లో ఒక్క రైతుకు కూడా రుణమాఫీ వర్తించలేదు. మండల వ్యాప్తంగా అన్ని బ్యాంకులకు మండల వ్యవసాయ అధికారిని కలవాలని నిబంధన విధించారు. ఆ మండల పరిధిలో రైతులంతా అక్కడి ఏఈఓకు ఫిర్యాదు ఇవ్వాలని, ఆధార్‌లో పేర్లు తప్పున్న రైతులు సరైన ఆధార్‌ను జతచేసి అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఓటరు కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, రేషన్‌కార్డు వంటి ఇతర గుర్తింపు పత్రాలను సేకరించి పేర్లు తప్పుగా ఉన్నవారు మరోమారు దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు.

జిల్లా వివరాలు

జిల్లాలో రైతుల సంఖ్య సుమారు 1.80 లక్షలు
పంట భూములు 4.40 లక్షల ఎకరాలు
రూ.లక్షలోపు రుణమాఫీ రైతులు 30,109
రూ.1.50 లక్షలలోపు రుణమాఫీ రైతులు 19,058
రూ.2 లక్షల రుణమాఫీ రైతులు 16,835
మూడు విడతల్లో మాఫీ అయిన రైతులు 66,002

సగం మందికే సంబరాలు..

రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డు ఆధారంగా ఒక కుటుంబానికి రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి తీరా ఇప్పుడు అంతకుపైగా ఉన్న రైతుల పేర్లు జాబితాలో పొందుపరుచలేదు. ఒక కుటుంబం రూ.2లక్షల కంటే అధికంగా రుణం తీసుకుంటే జాబితాలో పేర్లురాలేదు. ఒక రేషన్‌కార్డుపై ఇద్దరు, ముగ్గురు పేర్లతో రుణాలు తీసుకుంటే అందర్నీ లెక్కకట్టి రూ.2 లక్షలకంటే అధికంగా ఉన్నాయని జాబితాలో పంపించారు. రూ. 2లక్షల కంటే అధికంగా ఉన్నవారు బ్యాంకుల్లో డబ్బులు జమచేస్తే మిగిలింది ప్రభుత్వం జమచేస్తుందని చెబుతున్నారు. ఒక్కో కుటుంబంలో ముగ్గురు రైతుల పేరిట రుణం తీసుకుంటే రూ.4 నుంచి రూ.5 లక్షల మేర రుణాలు ఉన్నాయి. ప్రభుత్వం రూ.2 లక్షల రుణానికి మిగిలి ఉన్న మరో రూ.3 లక్షలు ఎక్కడి నుంచి తీసుకువచ్చి కట్టాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో ఎలాంటి సమాచారంలేదని తమకు ఏమి తెలియదంటూ వ్యవసాయ శాఖ అధికారులు దాటవేస్తున్నారు. దీనిపై స్పష్టమైన నిబంధనలు లేక పోవడంతో రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నిబంధనల పేరిట ప్రభుత్వం జాప్యం చేస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

ఖాతాల్లో డబ్బులు వేయాలి



రైతుల ఖాతాల్లో మాఫీ డబ్బులు జమ చేయాలి. రూ.2లక్షలకు పైగా బ్యాంకులో రుణం తీసుకున్నాం. ఆగస్టు 15న రూ.2 లక్షల రుణమాఫీ జాబితా వచ్చింది. అందులో మా పేరు లేదు. రుణం ఎంత ఉన్నా రూ.2 లక్షల మాఫీ డబ్బులు రుణ ఖాతాకు జమచేస్తే రైతులకు భారం తగ్గుతుంది. రైతుల ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని మాఫీని వర్తింపజేయాలి.

– కదం మోహన్‌రావు, రైతు, ఇలేగాం

మూడో విడత మాఫీ అయ్యింది



మూడో విడతలో ప్రభుత్వం జిల్లాలో 16,835 మంది రైతులను రుణ విముక్తులను చేసింది. రూ.227.50 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసింది. మొదటి, రెండవ విడతలో జాబితాల్లో పేర్లురాని రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నాం. రేషన్‌కార్డులులేని వారి వివరాలు సేకరిస్తున్నాం. ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాలో పేర్లు సరిగాలేని వారి వివరాలను మండల వ్యవసాయ అధికారులు సేకరిస్తున్నారు. అర్హులైన రైతులకు రుణమాఫీ తప్పక వర్తిస్తుంది.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి



అనుబంధాల రాఖీ..

నిర్మల్: అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధాలకు ప్రతీక రాఖీ. పోగులతో అల్లుకున్న దారం ఎంత బలంగా ఉంటుందో.. అలాగే ప్రేమ, ఆప్యాయతలతో అంతే దృఢంగా తమ అనుబంధాలు కలిసి ఉండాలని చూపిస్తుంది. అనాదిగా వస్తున్న రక్షాబంధన్ ఉత్సవం అన్నిపండుగల్లో కంటే వినూత్నమైంది. తన అన్నదమ్ముల కోసం అక్కాచెల్లెళ్లు స్వయంగా ఇళ్లకు వచ్చి, రాఖీలు కట్టి వారిని ఆశీర్వదించే తీరు ఇక్కడ ప్రత్యేకం. అలాగే తమ సోదరీమణులకు వీలుకాకపోతే అన్నదమ్ములే వాళ్లింటికి వెళ్లి మరీ రాఖీ కట్టించుకుంటారు. జిల్లా వ్యాప్తంగా నేడు రక్షాబంధన్ ఉత్సవాన్ని ఘనంగా జరుపుకోనున్నారు.

ఒక కుటుంబం.. ఒక వార్డు

- పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితా రూపకల్పన
- ఓటరు లిస్టులో కుటుంబ సభ్యులంతా వరుస క్రమంలో ఉండేలా చర్యలు
- ఇందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సిద్ధం చేసిన ప్రభుత్వం
- కార్యదర్శులకు పూర్తయిన శిక్షణ



చించోలి(బి) గ్రామ పంచాయతీ కార్యాలయం

నిర్మల్‌చైన్‌గేట్: గ్రామ పంచాయతీలకు త్వరలోనే ఎన్నికల నగారా మోగనుంది. స్థానిక ఎన్నికల నిర్వహణపై ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలిచ్చిన నేపథ్యంలో యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి కసరత్తు సైతం ప్రారంభమైంది. ఎన్నికల నిర్వహణలో ప్రధానమైన వార్డుల విభజనపై ప్రభుత్వం మొదట దృష్టి సారించింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాను తయారు చేయాలని అధికారులు ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఇటీవల జిల్లా ప్రాజెక్టు మేనేజర్, కంప్యూటర్ ఆపరేటర్లకు హైదరాబాద్‌లో శిక్షణ కూడా ఇచ్చారు. శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లతో జిల్లాలోని ఎంపీడీవో, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు.

కుటుంబమంతా ఒకే వార్డులో ఉండేలా..

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఓటరు జాబితా ఆధారంగా వార్డుల విభజన చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇట్టి జాబితాను అందించాలని ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. ఎన్నికల సంఘం నుంచి నియోజకవర్గం, మండలాలు, గ్రామాల వారీగా ఓటరు జాబితా రాగానే వార్డుల వారీగా విభజన చేయాలని నిర్ణయించింది. వార్డుల విభజనకు సంబంధించి పాటించాల్సిన మార్గదర్శకాలపై మాస్టర్ ట్రైనర్లకు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. గత ఎన్నికల సమయంలో ఒక కుటుంబంలో ఓటర్లు రెండు, మూడు వార్డుల్లో ఉండడం, కొన్ని చోట్ల ఇతర గ్రామాల్లోనూ ఓటరుగా నమోదై ఉండడం లాంటివి ప్రభుత్వం గుర్తించింది. ఈ క్రమంలో ఒక కుటుంబానికి చెందిన ఓటర్లను ఒక వార్డు పరిధిలోకే వచ్చేలా విభజన చేయనున్నారు. ఈ క్రమంలో రెండు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశా, గ్రామ పంచాయతీ సిబ్బందిని సమన్వయం చేసుకుని జాబితా తయారు చేయాలని సూచించారు. ఓటరులిస్టులో కుటుంబ సభ్యులంతా ఒకే వరుస క్రమంలో ఉండేలా చూసుకోవాలని సూచించింది. ఇందుకోసం ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేసింది. ఆ సాఫ్ట్‌వేర్ ద్వారా వార్డుల విభజన చేయనున్నారు.

ఏడు నెలలుగా ప్రత్యేక పాలన..

2024 ఫిబ్రవరి 1తో సర్పంచులు, వార్డు సభ్యుల పదవీ కాలం ముగిసింది. 2023లో అసెంబ్లీ ఎన్నికలు, కొత్త ప్రభుత్వం ఏర్పాటు, లోక్‌సభ ఎన్నికలు రావడంతో పంచాయతీ ఎన్నికల నిర్వహణ జాప్యం అయ్యింది. అయితే గత ఎన్నికల్లో ఓటర్లు, ప్రస్తుత ఓటర్లు, గత ఎన్నికల సందర్భంగా వార్డులకు, సర్పంచ్ పదవికి ఉన్న రిజర్వేషన్ ఏంటన్న అంశాలపై ఎన్నికల సంఘం కలెక్టర్ల నుంచి గతేడాది డిసెంబర్‌లోనే నివేదిక తీసుకుంది. దీనిని 'తెలంగాణ-పోల్'(టీఈ-పోల్) వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేశారు. ఉద్యోగుల వివరాలతో పాటు 2009, 2014, 2019 పంచాయతీ ఎన్నికల్లో వార్డులు, గ్రామాల వారీగా కేటాయించిన రిజర్వేషన్ వివరాలను 'పీఆర్ఎస్'మాడ్యూల్లో గతేడాదే పొందుపరిచారు. అధికారులు ఓటరు, వార్డు జాబితాలను సిద్ధం చేస్తున్న నేపథ్యంలో వచ్చే సెప్టెంబర్ మొదటి వారంలో షెడ్యూల్ వచ్చి మూడోవారంలో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది.

మూడు విడతలుగా ఎన్నికలు...

గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సర్పంచ్ ఎన్నికలను మూడు విడతలుగా ప్రభుత్వం నిర్వహించనుంది. జిల్లాలో 396 గ్రామ పంచాయతీలు, 3,338 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సిబ్బంది కేటాయింపుపై ఎన్నికల సంఘం గతంలోనే మార్గదర్శకాలు జారీ చేసింది. వాటి ప్రకారం.. ఒక్కో వార్డుకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఓటర్ల ప్రాతిపదికన పోలింగ్ కేంద్రాలకు ప్రిసైడింగ్ అధికారి, పోలింగ్ అధికారులను కేటాయించనున్నారు. 200 ఓట్లలోపు ఉన్న పోలింగ్ కేంద్రాలకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక పోలింగ్ అధికారి, 200 నుంచి 400 ఓట్లు ఉన్న కేంద్రాలకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 650 పైన ఓట్లు ఉన్న కేంద్రాలకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులు విధులు నిర్వర్తించనున్నారు. 650 ఓట్లు పైన ఉన్న గ్రామాల్లో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం గతేడాది డిసెంబర్‌లో సూచించింది.

మాన్యువల్‌గా ఓటరు నమోదు ప్రక్రియ

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశానుసారం ప్రస్తుతం మాన్యువల్‌గా ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతుంది. రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి కానుంది. ఒకే కుటుంబంలో ఉన్న ఓటర్లు అందరూ ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే అధికారులకు మాస్టర్ ట్రైనర్లచే శిక్షణ పూర్తి అయ్యింది. త్వరలోనే ఆన్‌లైన్‌లో కూడా ఓటరు నమోదు ప్రక్రియ చేపడతాం.

– శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి

న్యూస్‌రీల్

పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తి మరువలేనిది

నిర్మల్‌చైన్‌గేట్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తి మరువలేనిదని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాపన్న గౌడ్ 374వ జయంతి వేడుకలు నిర్వహించారు. పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దొరలు, భూస్వాములు, పెత్తందార్లకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధుడని, ఇలాంటి మహనీయుల జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. పోరాట యోధుల చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో భుజంగ్‌రావ్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, మెప్మా పీడీ సుభాష్, డీఎంహెచ్‌వో రాజేందర్, అధికారులు, సిబ్బంది, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రా రైస్‌మిల్ జిల్లా కార్యవర్గాలు

భైంసాటౌన్: రా రైస్‌మిల్ జిల్లా కార్యవర్గాలు రెండు వేర్వేరుగా ఎన్నికయ్యాయి. జిల్లాలో 90కి పైగా రా రైస్‌మిల్లులు ఉండగా 35 మందితో ఓ కార్యవర్గం, మిగిలిన వారితో మరో కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భైంసాకు చెందిన సట్లవార్ మహేశ్ అధ్యక్షుడిగా ఓ యూనియన్, లోకేశ్వరంకు చెందిన కోస్లి వెంకట్రావు అధ్యక్షుడిగా మరో యూనియన్ ఏర్పాటయ్యాయి. ముందుగా ఎన్నిక నిర్వహించి ఒకే యూనియన్ ఏర్పాటు చేయాలని అనుకున్నా.. రెండు వర్గాల మధ్య పొసగక వేర్వేరుగా రెండు కార్యవర్గాలు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిసింది. ఇదివరకు ఒకే యూనియన్ ఉండగా ఈసారి రెండు వర్గాలుగా విడిపోయి ఎవరికి వారే అన్న చందంగా వారివారి అనుకూల వర్గాలతో జిల్లా కార్యవర్గాలను ఎన్నుకున్నారు. త్వరలో జిల్లాకు రారైస్‌మిల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రానుండగా ఆయన సమక్షంలో ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదిర్చి ఒకే యూనియన్ ఏర్పాటు చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా జిల్లాలో రా రైస్‌మిల్ అసోసియేషన్‌కు రెండు జిల్లా కార్యవర్గాలు ఏర్పాటు కావడంపై ఆ వర్గాల్లోనే కొందరు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

జోరుగా పత్తాలాట..!

పట్టణంలోని భైంసా–బాసర్ మార్గంలో రహదారి పక్కన గల ఓ భవనంలో శనివారం పేకాడుతూ 12 మంది పట్టుబడ్డారు. పక్కా సమాచారం మేరకు ఏఎస్పీ అవినాష్ కుమార్ స్వయంగా రంగంలోకి దిగి పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో ఓ ప్రధాన పార్టీకి చెందిన ఇద్దరు నాయకులు, ఓ బంగారు, వెండి వర్తకుడు, ఇతరులు ఉన్నారు. ఇదిలా ఉంటే, పోలీసులకు పేకాట స్థావరంలో ఓ మైక్ లాంటి పరికరం లభించింది. పోలీసులు ఎవరైనా తనిఖీలకు వస్తే ఆ స్థావరం వద్ద ఓ వ్యక్తి ముందుగానే గమనించి లోపల పేకాడుతున్నవారిని అప్రమత్తం చేస్తాడు. దీంతో పోలీసులు వచ్చేలోపు వారు అక్కడి నుంచి మెల్లగా జారుకునేలా ఏర్పాటు చేసుకున్నారు. ఇది చూసిన పోలీసులు వారి తెలివికి ముక్కున వేలేసుకున్నారు.

- పేకాడుతూ పట్టుబడుతున్న వ్యాపారులు, నాయకులు
- పలుమార్లు పట్టుబడినా మారని తీరు



భైంసాలోని పేకాట స్థావరం వద్ద తనిఖీ చేస్తున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్, ఎస్సై షరీఫ్ (ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలో పేకాట జోరుగా సాగుతోంది. పలు ప్రాంతాల్లో అడ్డాలు ఏర్పాటు చేసుకుని గుట్టుగా పత్తలాడుతున్నారు. మొదట సరదాగా మొదలుపెట్టి తరువాత వ్యసనంగా మారి ఎందరో మంది పేకాటబారిన పడుతున్నారు. ముఖ్యంగా బడా వ్యాపారులు, చోటామోటా నాయకులు కొందరు ఆదివారాలు, సెలవు దినాల్లో వారివారి స్థావరాల్లో రూ.వందలు మొదలు రూ.వేలల్లో పెట్టి పేకాడుతున్నారు. పట్టణంలోని పాత బంగారు, వెండి వర్తక దుకాణ సముదాయం ప్రాంతంలో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, నిర్మల్ చౌరస్తా, బాసర మార్గంలోని ఓ భవనంలో పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. పైన తెలిపిన ప్రాంతాల్లో పేకాడుతూ పదుల సంఖ్యలో పేకాటరాయుళ్లు పోలీసులకు పలుమార్లు పట్టుబడిన సందర్భాలున్నాయి. కొందరు తరచూ పోలీసులకు పట్టుబడుతున్నా వారి తీరు మారడం లేదు.

గుట్టుగా స్థావరాలు...

పట్టణంలోని పలు ప్రాంతాల్లో పేకాటరాయుళ్లు అడ్డాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ముఖ్యంగా సాయంత్రం, రాత్రి వేళల్లో ఎక్కువగా పేకాడుతుంటారు. ఆదివారాలు, సెలవు దినాల్లో ఎక్కువగా ఉంటుంది. గుట్టుగా స్థావరాలు ఏర్పాటు చేసుకుని రూ.వేలల్లో జూదమాడుతున్నారు. పోలీసులకు పట్టుబడకుండా కొత్త దారులు ఎంచుకుంటున్నారు. శనివారం పట్టుబడిన కేసులో పోలీసులకు అలారం లాంటి పరికరం దొరకడమే ఇందుకు నిదర్శనం. పోలీసులు దాడులకు వస్తే ముందుగానే అప్రమత్తం చేసుకునేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఏఎస్పీ అవినాష్‌కుమార్‌కు పక్కా సమాచారం ఉండడంతో ఈ మేరకు శనివారం ముందు జాగ్రత్తగా స్థావరానికి సిబ్బందితో చేరుకుని వారు పారిపోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. దీంతో ఏకంగా 12 మంది పేకాడుతూ పట్టుబడగా వారి వద్ద నుంచి 12 మొబైల్ ఫోన్లు, రూ.57వేల నగదు, రెండు బైక్‌లు, ఒక కారు సైతం పట్టుబడడం గమనార్హం. ఇటీవల భైంసా మండలంలోని మహాగాంలో సైతం పలువురు పేకాడుతూ పట్టుబడ్డారు. పోలీసులు మరింత దృష్టి సారించి పేకాట నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


కేసులు నమోదు చేస్తాం

పేకాట ఆడడం చట్టరీత్యా నేరం. ఎవరైనా పేకాట ఆడుతూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తాం. ఎక్కడైనా పేకాట స్థావరాలుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటాం.

– అవినాష్ కుమార్, ఏఎస్పీ, భైంసా

కత్తి కిరణ్‌కు 'తెలంగాణ ఐకాన్' అవార్డు

నిర్మల్: జిల్లా కేంద్రానికి చెందిన ఫిజియోథెరపిస్ట్ కత్తి కిరణ్ తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ద్వారా ప్రతిష్టాత్మక తెలంగాణ ఐకాన్ పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో టీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డు అందజేశారు. సాంస్కృతిక, సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నందువల్ల కిరణ్‌కు ఈ పురస్కారం దక్కింది.



సన్మానిస్తున్న నిర్మల జగ్గారెడ్డి



వివేకానంద చౌరస్తా వద్ద రోడ్డుపై పారుతున్న డ్రెయినేజీ నీరు



పాత ఆర్టీఏ చెక్‌పోస్ట్ వద్ద జాతీయ రహదారిపై నిలిచిన వర్షపునీరు



డ్రెయినేజీ గుంతలో పడిన గేదె

భైంసాలో జోరు వాన..!

భైంసాటౌన్: పట్టణంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం దాదాపు గంటసేపు జోరువాన కురవడంతో రోడ్లు జలమయమయ్యాయి. డ్రెయినేజీల్లో నీరు రోడ్డుపై ప్రవహించింది. స్థానిక పాత ఆర్టీవో చెక్‌పోస్ట్ వద్ద 61వ జాతీయ రహదారిపై కూడలిలో రోడ్డుపై నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కుభీర్ చౌరస్తాలోని వివేకానంద చౌరస్తాలో సైతం డ్రెయినేజీ నీరు ఉప్పొంగి రోడ్డుపై పారడంతో ద్విచక్ర వాహనదారులు అవస్థలు పడ్డారు. ఇదే సమయంలో ఓ గేదె నీటి ప్రవాహంలో డ్రెయినేజీ గుంత గమనించక అందులో పడిపోవడంతో అతికష్టం మీద బయటకు వచ్చింది.

క్లుప్తంగా

నవజాత శిశువు మృతిపై కలెక్టర్ ఆరా

సాక్షి స్పందన

ఉట్నూర్‌రూరల్: నార్నూర్ మండలం ఏంపల్లి గ్రామానికి చెందిన గర్భిణి దుర్గుబాయి 108లో నార్నూర్ నుంచి ఉట్నూర్‌కు తరలిస్తుండగా ప్రసవించింది. బాబుకు జన్మనివ్వగా నవజాత శిశువు మృతిచెందాడు. ఈ ఘటనపై '108లో మహిళ ప్రసవం మగ శిశువు మృతి' శీర్షికన ఆదివారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా స్పందించారు. సమగ్ర నివేదికను అందించాలని జిల్లా వైద్యాధికారి కృష్ణను ఆదేశించారు. పీహెచ్‌సీ వైద్యుడి ద్వారా గర్భిణి సమాచారం సేకరించి కలెక్టర్‌కు నివేదికను అందజేశారు.

అమ్మవారి సన్నిధిలో పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న మనోహరెడ్డి కుటుంబ సభ్యులు

బాసర: బాసర శ్రీ జ్ఞానసరస్వతి అమ్మవారిని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లె మనోహరెడ్డి ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకుడు అచ్యుత్ వారికి తీర్థప్రసాదం అందజేశారు. మాజీ సర్పంచ్ పి.సతీశ్‌రావు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్నల సాయినాథ్ పటేల్, నాయకుడు గణేశ్ చవాన్ ఉన్నారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తిపై కేసు

ఇచ్చోడ: మండల కేంద్రంలో చికెన్ సెంటర్ గల్లీలో శనివారం సాయంత్రం గుడ్‌మార్నింగ్ బేకరి యజమాని షేక్ జునేద్‌ని ఇచ్చోడకు చెందిన తుమ్మల సతీశ్‌రెడ్డి కత్తితో దాడి చేసి గాయపర్చాడు. బేకరి వద్ద సిగరెట్ కొనుగోలు విషయమై గొడవ జరిగింది. బాధితుడు ఫిర్యాదుతో సతీశ్‌రెడ్డిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ పేర్కొన్నారు.

ఇంట్లో చోరీ

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని సోమవార్‌పేట్‌లో గల ఓ ఇంట్లో అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబ సభ్యులంతా ఉక్కపోత భరించలేక శనివారం రాత్రి ఇంటి ప్రధాన ద్వారానికి తాళం వేసి మొదటి అంతస్తులో నిద్రించారు. ఈక్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి చొరబడ్డారు. బీరువాలో 2 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి, రూ.48 వేల నగదు ఎత్తుకెళ్లారు. పట్టణ పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అమెరికా నుంచి వచ్చి..



నేను మంచిర్యాల నుంచి పెళ్లి తర్వాత ఉద్యోగరిత్యా భర్తతో అమెరికా వెళ్లాను. తమ్ముడు దినేష్‌కు రెండేళ్లుగా నేరుగా రాఖీ కట్టలేదు. పండుగలోపు రాఖీని కొని పంపించేదాన్ని. ఈ ఏడాది ఎలాగైనా రాఖీ కట్టాలని మంచిర్యాలకు వచ్చాను. తమ్ముడికి రాఖీ కట్టేందుకు ఎదురుచూస్తున్నాను.
– చిటుమల్ల దివ్య, కాలిఫోర్నియా, అమెరికా

అన్నయ్యపై ప్రేమతో వస్తున్నా



బెల్లంపల్లి: మాది నెన్నెల మండలం గొల్లపల్లి స్వగ్రామం. నాకు పెళ్లై 9 ఏళ్లు కావస్తోంది. భర్త సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ప్రస్తుతం హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్నారు. ఏటా రాఖీ పండుగకు నేను ఎక్కడున్నా సోదరుడు రమేశ్ వద్దకు వచ్చి రాఖీ కట్టడం నాకెంతో ఇష్టం. తోబుట్టువుపై ఉన్న ప్రేమతో పండుగకు ఒకరోజు ముందుగా ఇంటికి వచ్చాను.
– గంద్ర సుమలత, హైదరాబాద్

తమ్ముడికి రాఖీ కట్టడానికి వచ్చాను



తమ్ముడికి రాఖీ కట్టడం ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. ప్రస్తుతం నేను హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాను. ప్రత్యేకంగా సెలవు తీసుకుని నెన్నెలలో ఇంటికి వచ్చాను. తమ్ముడికి రాఖీ కట్టి పండుగ జరుపుకుంటాం.– చిన్నోజు నిహారిక, నెన్నెల

పండుగకు ఇంటికొస్తా



ప్రస్తుతం నేను వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. ఇద్దరు అన్నలు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్నారు. రాఖీ పండుగ రోజు ఇంటికి వచ్చి పండుగ జరుపుకోవడంలో ఉన్న తృప్తి వెలకట్టలేనిది. – గొల్ల శిరీష, వరంగల్, మాదారం

రక్షా'బంధం'



• అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక
• నేడు రాఖీపౌర్ణమి

ఏటా శ్రావణమాసంలో వచ్చేపౌర్ణమి తిథి రోజు రాఖీ జరుపుకుంటారు. శాస్త్రప్రకారం భద్రకాలం ముగిసిన తర్వాత రాఖీ కట్టాలి. ఈ తిథుల విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమి తిథి సోమవారం తెల్లవారుజాము 3:04 గంటలకు ప్రారంభమై రాత్రి 11:55కు ముగుస్తుంది. అయితే ఆ మధ్యలో భద్రకాలం ఉదయం 5:53 నుంచి మధ్యాహ్నం 1:32 గంటల వరకు సోదరులకు రాఖీ కట్టకూడదని పండితులు చెబుతున్నారు. మిగిలిన సమయంలో రాఖీలు కట్టవచ్చని పేర్కొంటున్నారు.

కెరమెరి(ఆసిఫాబాద్): 'అన్నయ్య సన్నిధి అదే నాకు పెన్నిధి..కనిపించే దైవమే ఆ కనులలో సన్నిధి' అని ఓ చెల్లి తన సోదరుడి గురించి పాట పాడడంలో ఎంతో అర్థం ఉంది. తనను ప్రాణం కంటే మిన్నగా ప్రేమించే అన్నయ్యలంటే ప్రతీ చెల్లికి అభిమానమే. సోదరీసోదరుల ఆత్మీయతకు అద్దం పట్టేదే రక్షా'బంధనం'. ఇంటి ఆడపడుచు మహాలక్ష్మి స్వరూపంగా, పరాశక్తికి ప్రతీకగా భావించే సంస్కృతి మనది. కష్టసుఖాల్లో మేము మీకు అండగా ఉన్నామన్న భరోసాను సోదరులు అక్కా చెల్లెళ్లకు కల్పించడమే రాఖీ బంధం. అన్నాచెల్లెళ్ల ఆత్మీయ చిహ్నానికి, వారి మధ్య అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమిని నేడు ఉమ్మడి జిల్లాలో ఘనంగా జరుపుకోనున్నారు. అక్కాచెల్లెళ్లు సోదరులకు రాఖీలు కట్టి మిఠాయి తినిపిస్తారు. తర్వాత వారు కానుకలు ఇస్తారు. ఇది వారి ప్రేమ, అనురాగానికి వారధిగా నిలుస్తుంది. సుదూర ప్రాంతాల్లో ఉన్న వారు ఆత్మీయులకు పోస్టు ద్వారా లేదా ఇతర మార్గాల ద్వారా రాఖీలను పంపారు. భారతీయ ధర్మశాస్త్రాల్లో తెలిపిన రక్షాబంధన్ రోజున సోదరునికి తిలకధారణ గావించి అక్షింతలతో ఆశీర్వదించి రక్షణ కవచాన్ని కడుతుంది. ఇది దేవతారక్షగా కాపాడుతుందని వారి నమ్మకం.

దేవతల కాలం నుంచి..

శ్రీరామునికి కౌసల్య రాఖీ కట్టిందని, రాక్షసుడు విష్ణు భక్తుడైన బలికి మహాలక్ష్మి రాఖీ కట్టి మృత్యువు నుంచి కాపాడిందని, శకుంతల తన గారాల కొడుకు భరతునికి శత్రుభయం లేకుండా తాయిత్తు కట్టిందని కథలు ఉన్నాయి. దేవేంద్రుడు సకల రాక్షసుల మధ్య 12 ఏళ్లు మహాయుద్ధం జరిగింది. ఈ సందర్భంలో రాక్షస రాజు ముల్లోకాలను జయించాడు. పరిస్థితిని గుర్తించిన బృహస్పతి ఇంద్రునికి విజయం కలగాలని ఇంద్రాణితో రక్ష కట్టించాడు. ఇది శ్రావణపౌర్ణమి రోజు వేద పండితుల మంత్రోచ్ఛారణలో జరిగిందని పురాణాలు చెబుతున్నాయి.

రాజుల కాలం నుంచి..

రాజుల కాలం నుంచి రక్షాబంధం గురించి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. అలెగ్జాండర్ ప్రేయసి రుక్సానా పురుషోత్తమునికి రక్షా సూత్రం కట్టినందుకే అతన్ని విడిచిపెట్టాడు. హుమాయూన్ చక్రవర్తి రాణి కర్ణావతి రాఖీ పంపించి అతడి రక్షా పొందింది. ఛత్రపతి శివాజీ భవానిదేవి ప్రసాదించిన ఖడ్గాన్ని పొంది వేద ధర్మరక్షణలకు ప్రతిన చేస్తూ రక్షా ధరించారనే కథలు ప్రచారంలో ఉన్నాయి. శ్రావణపౌర్ణమిన రాఖీ కట్టడం వల్ల తల్లీబిడ్డకు, భార్యభర్తలకు తొలి దశ ఏర్పడింది. మలిదశలో సోదరీ సోదరునికి రక్షా కట్టడం జరిగింది. ఈ కాలంలో ప్రతీ మహిళా తనకు పరిచయం ఉన్న పురుషునికి సోదరభావంతో రాఖీ కట్టడం, రాఖీ పంపడం, రాఖీని అందుకున్న పురుషుడు ఆమెను సోదరిగా బహుమతులివ్వడం ఆనవాయితీగా వస్తోంది.

అన్నయ్య అంటే ఇష్టం



మంచిర్యాలటౌన్: మా అన్నయ్య సాయికృష్ణ గౌడ్ అంటే చాలా ఇష్టం. ఉద్యోగ రీత్యా అన్నయ్య ఓ చోట, నేను హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నా. నేను, అన్నయ్య మంచిర్యాలకు వచ్చాం. పండుగ రోజున అన్నయ్య రాఖీ కడుతాను.
– బొడిగె దీప్తిగౌడ్, బీటెక్ థర్డియర్, మంచిర్యాల

ఎక్కడున్నా తమ్మునికి రాఖీ కట్టుడే



హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నా. చిన్ననాటి నుంచి తమ్ముడు శ్రీచరణ్‌కు రాఖీ కడుతున్నాను. చదువు పూర్తయి, ఉద్యోగంలో చేరినా పండుగకు ఇంటికి వచ్చి, తమ్మునికి రాఖీ కడుతుంటాను. సెలవులు రావడంతో రెండు రోజులు ముందుగానే మంచిర్యాలకు వచ్చాను. – చిలువేరు శ్రీనిజ, మంచిర్యాల

రాఖీ కట్టి యూఎస్ వెళ్లి..



నేనే ఈ ఏడాది బీటెక్ పూర్తిచేశాను. ఎంఎస్ చేసేందుకు అమెరికా వెళ్లాల్సి వచ్చింది. రెండురోజుల ముందే తమ్ముడు చరిత్‌కు రాఖీ కట్టాను. ఈ ఏడాది మాత్రం రాఖీని రెండురోజుల ముందే కట్టి వెళ్లాను.
– ముత్యాల సంహిత, మంచిర్యాల

విడదీయని బంధం



ఆసిఫాబాద్‌అర్బన్: రాఖీ పండుగ సోదర భావాన్ని గుర్తుచేస్తుంది. అన్నాచెల్లెళ్లు, అక్కల బంధం జీవితంలో విడదీయరానిది. ప్రతిఏటా మహారాష్ట్రలోని పుణెలో ఉన్న మా సోదరులకు రాఖీ కడుతాను. అదేవిధంగా అక్కాచెల్లెలు లేనివారికి రాఖీ కట్టడం ఎంతో తృప్తినిస్తుంది.
– సిద్దెంశెట్టి సుహాసిని, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యురాలు

అన్నాదమ్ములంటే ఓ భరోసా



అమ్మలోని మొదటి అక్షరం..నాన్నలోని రెండవ అక్షరం కలిపితే ఏర్పడేది అన్నయ్య. నేను పోలీసుశాఖలో పనిచేస్తున్నా. కాగజ్‌నగర్‌లో ఉంటున్న తన అన్నయ్యకు రాఖీ కట్టడం ధైర్యాన్నిస్తుంది. రాఖీ పండుగ సంతోషాన్ని మాటల్లో చెప్పలేను. – సునీత, షీటీం హెడ్ కానిస్టేబుల్, ఆసిఫాబాద్

పండగంటే ఇష్టం

ప్రతిఏటా ఆసిఫాబాద్‌లో ఉంటున్న అమ్మానాన్నల సమక్షంలో రాఖీ పండుగను చేసుకుంటాం. అమ్మ చేతి వంటలను ఆస్వాదిస్తాం. అన్నయ్యకు రాఖీ కట్టడంతో మంచి జరుగుతుందని ఎంతో నమ్మకం. నాన్న రంగుల రాఖీలు తీసుకువస్తాడు. ఈ పండుగ అంటే ఇష్టం. – తాటిపల్లి ఈశ్వర్, శ్రేష్ఠ, అన్నాచెల్లెలు, వరంగల్

ఎన్ని పనులున్నా వెళ్తా..

మా ఊరు చెన్నూర్. వివాహం తర్వాత హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాం. ఎన్ని పనులు ఉన్నా సొంత ఊరికి వెళ్తాను. అన్నయ్యకు రాఖీ కట్టి అతను ఇచ్చే కానుకలను భద్రంగా దాచుకుంటాను. స్నేహితులు, బంధువులకు చూపించి సంతోషిస్తాను.
– అభిలాష్‌కు రాఖీ కడుతున్న చెల్లెలు స్వప్న

ఉద్యోగానికి లీవ్ పెట్టి

వృత్తిరీత్యా కరీంనగర్. హైదరాబాద్‌లో ఉంటాం. రాఖీ పండుగ వస్తే కరీంనగర్‌లో ఉన్న చెల్లి బుగ్గారపు హర్షిని వద్దకు వెళ్లి రాఖీ కట్టుకుంటాం. ఎంత పని ఉన్నా లీవ్ పెట్టి అక్కడకు వెళ్తాను. రాఖీ పండుగకు తీసిన ఫొటోలను భద్రంగా దాచుకుంటాను.
– హర్షిని, సంగనబట్ల రేవంత్, భరత్‌కుమార్



శ్రీనివాస్‌కు రాఖీ కడుతున్న రాధ

తోడబుట్టకపోయినా అన్నాచెల్లెళ్లమే

నిర్మల్: వాళ్లిద్దరు తోడబుట్టకపోయినా అన్నాచెల్లెళ్లే. జిల్లా ప్రధాన ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న రాధ, అదే ఆస్పత్రిలో ఆరోగ్యమిత్రగా చేస్తున్న కొటిక శ్రీనివాస్‌లు అన్నాచెల్లెలుగా కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారు. శ్రీనివాస్ తల్లిదండ్రులు చనిపోయిన తర్వాత తన ఆస్పత్రిలోనే నర్సుగా చేసే రాధ ప్రతిరోజూ భోజనం తీసుకువచ్చేది. ఆయన పెళ్లి చేయడంలోనూ, భార్య పద్మ గర్భవతి అయినప్పుడూ తను పూర్తి బాధ్యత తీసుకుని డెలివరీ చేయించింది.

అన్నలా చూసుకుంటాడు

నాకు తోడబుట్టిన అన్నతమ్ముడు లేరు. శ్రీనన్ననే నాకు తోడబుట్టిన అన్న లాగా చూసుకుంటాడు. ప్రతీ ఏడాది రాఖీ పండుగకు అన్న ఎక్కడ ఉన్నా.. కచ్చితంగా రాఖీ కడతాను. – రాధ, నిర్మల్



గుంటూరు నుంచి అక్కవద్దకు వచ్చిన డాక్టర్ నరేశ్

450 కి.మీ. దూరం నుంచి..

అక్కాతమ్ముళ్ల అనుబంధాన్ని దూరాలు వేరు చేయలేవనడానికి వీరే ఉదాహరణ. అక్కతో రాఖీ కట్టించుకోవడానికి తమ్ముడు 450 కి.మీ దూరం నుంచి వచ్చాడు. జిల్లా కేంద్రానికి చెందిన గైనకాలజిస్ట్ చంద్రిక సొంతూరు గుంటూరు జిల్లా పిడుగురాళ్ల. నిర్మల్‌కు చెందిన డాక్టర్ అవినాశ్‌ను పెళ్లిచేసుకున్న తర్వాత ఇక్కడికి వచ్చారు. ఆమె సోదరుడు డాక్టర్ నరేశ్ గుంటూరులో క్రిటికల్‌కేర్ వైద్యుడిగా స్థిరపడ్డారు. రాఖీ పండుగ కోసం ఆయన నిర్మల్ వచ్చారు.

అనుబంధానికి ప్రతీక

రక్షాబంధన్ అంటేనే అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక. మా తమ్ముడు డాక్టర్ నరేశ్ అంతదూరం నుంచి నా కోసం రావడం చాలా సంతోషంగా అనిపిస్తుంది. రాఖీ పండుగ అక్కాతమ్ముళ్ల మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తుంది.
– డాక్టర్ చంద్రిక, నిర్మల్

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని పిట్టలవాడ కాలనీకి చెందిన ద్యానంగుల హన్మంతు అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పనికి వెళ్తానని చెప్పి రోజులాగే ఈనెల 16న ఇంటి నుంచి బయల్దేరి వెళ్లి రాత్రి తిరిగి రాలేదు. ఆయన ఆచూకీ కోసం కుటుంబీకులు చుట్టు పక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా దొరకలేదు. భార్య రేఖ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య

బోథ్: మండలంలోని నిగినీ గ్రామానికి చెందిన మట్ట సరస్వతి (17) ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. డబ్బుల విషయంపై కుటుంబ సభ్యులు మందలించడంతో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్సై పేరిట వ్యాపారులకు ఫేక్ ఫోన్ కాల్స్

ఆదిలాబాద్‌టౌన్: కొందరు అపరిచితులు వన్‌టౌన్ ఎస్సై అని చెబుతూ వ్యాపారులకు ఫేక్ ఫోన్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని సీఐ సునీల్ కుమార్ ఆదివారం తెలిపారు. పట్టణంలోని బంగారు దుకాణాల యజమానులకు ఫోన్ చేసి బంగారం సంబంధించి పాత కేసు ఉందని, స్టేషన్‌కు రావాలని చెబుతున్నారని పేర్కొన్నారు. వీడియోలు పంపుతానని, వచ్చి సెటిల్మెంట్ చేసుకోవాలని ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు చెప్పారు. వ్యాపారులెవరు అలాంటి ఫోన్‌కాల్స్‌కు స్పందించొద్దని సూచించారు. ఎవరైన ఫోన్ చేస్తే స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని వివరించారు. ఇటీవల వ్యాపారులకు ఫోన్ చేసిన గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.



నిర్మల్‌లో కొంగల సందడి



మహబూబ్ ఘాట్ రోడ్డు ఏరియల్ వ్యూ

జ్ఞాపకాలు పదిలం..

ఒక్క ఫొటో ఎన్నో మధుర జ్ఞాపకాలు కదలాడుతాయి. కాలం గిర్రున తిరుగుతున్నప్పటికీ చిత్రం చూడగానే గత స్మృతులు మనసులో మెదలుతాయి. కాలానుగుణంగా ప్రకృతిలో చోటు చేసుకునే మార్పులు బంధించి పదిలంగా దాచుకొని మళ్లీమళ్లీ చూసుకునే అవకాశం. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్, నిర్మల్ సాక్షి ఫొటోగ్రాఫర్లు తీసిన చిత్రాలు. - సాక్షి ఫొటోగ్రాఫర్ ఆదిలాబాద్/నిర్మల్



రోడ్డుపై పచ్చని పందిరి కింద నుంచి వెళ్తూ..



ఎరుపు, ఆకుపచ్చ రంగులతో చెట్లు



ఆదిలాబాద్ జిల్లా సలాయిగూడలో ఆదివాసీల జీవన చిత్రం



ఒంపుసొంపుల జాతీయ రహదారి..దేవాపూర్ చెక్‌పోస్టు ప్రాంతంలో..

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



అజ్మీర రాజేశ్ మృతదేహం

దస్తురాబాద్: మండలంలోని ఎర్రగుంట గ్రామానికి చెందిన రైతు అజ్మీర రాజేశ్ విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఇన్‌చార్జి ఎస్సై శంకర్ కథనం ప్రకారం.. అజ్మీర రాజేశ్ తన పొలంలో గడ్డి కోసే యంత్రంతో ఆదివారం గడ్డిని కోస్తున్నాడు. ఈక్రమంలో విద్యుత్ స్తంభం నుంచి వచ్చే త్రీఫేజ్ వైరు కట్ అయి రైతు చేతివేళ్లపై పడింది. విద్యుత్ షాక్‌తో అక్కడిక్కడ మృతిచెందాడు. పక్కన ఉన్న రైతు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు అక్కడకి చేరుకుని విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య శ్రీవాణి ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాపు చేస్తున్నట్లు తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



కుంటాల: కుంటాల ఉన్నత పాఠశాలలో 2004-05, సృజన విద్యాలయం పాఠశాలలో చదివిన 2014-15 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పాఠశాలల్లో నిర్వహించిన అపూర్వ సమ్మేళనాలకు వారు హాజరయ్యారు. ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనాటి తీపిగుర్తులను నెమెరువేసుకున్నారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

